# నాయకుడు వెలిశాడు

మాహనుమంతరావు

క్రింగ్‌క్లబ్ కలకలలాడుతున్నది ఆనందంతో కేరింతలు కారుతున్నది. పదహారు సంవత్సరాల పడతి యవ్వనంలా పెటపెటలాడుతున్నది. బీదవాడి ఆర్థిక అనారోగ్యంలా దట్టంగా పేరుకున్న చీకటిని లోపలికి రానీయకుండా 'బార్' అంతా ఖరీదైన మనుష్యులతో వెలిగిపోతున్నది. క్లబ్ ఆవరణలో కార్ల సంఖ్య పెరుగుతున్నది. కాలం ప్రసవవేదన పడుతున్నది. గోడగడియారం పన్నెండుగంటలు కొట్టింది. సంగీత వాయిద్యాల స్వరకల్పనతో క్లబ్ మారుమ్రోగింది. జనవరి ఒకటవ తేదీ కెవ్వున కేకవేసింది. నూతన సంవత్సరం ప్రవేశించింది.

క్లబ్ మెయిన్‌హాల్ మధ్యనున్న స్టేజీ అంతా కాంతివంతమైన దీపాల ఫోకస్‌లో మెరిసిపోతున్నది. స్టేజీమీద అనౌన్సర్ బిగ్గరగా అరిచాడు. "విష్ యు ఆల్ ఏ హేపీ న్యూయిర్" వెంటనే క్లబ్ బృందగానం చేసినట్లు "విష్ యు ఏ హేపీ న్యూయిర్" అని కేకలతో, అరుపులతో దద్దరిల్లింది. అనౌన్సర్ ఎవరో తరుముతున్నట్లు, అనువాద సాహిత్యం చదువుతున్నటు గబగబా చదవసాగాడు.

కమాన్ యిట్స్ జీరో అవర్
విష్ యు ఆల్ ఏ హేపీ న్యూయిర్
(సేమ్ టు యూ... సేమ్ టు యూ... క్లబ్‌లో కేకలు)
సుక్రియా హమేషా హుషార్
స్త్రీ పురుష బేదం సదా పరార్
(హియర్.. హియర్... చప్పట్లు)
నేడొక ప్రత్యేకపు వింత వేడుక
ఖరీదైన మనుష్యుల కలియిక
ప్లస్ మైనస్ చేతుల మెలిక
వెచ్చబడుతున్న శరీరాల కెరుక
(హే.. హే.. యా.. యా... పాముల బుసలు కొడుతున్నట్లు చప్పరింపులు.. సకిలింపులు...)
మనవి సుఖజీవితాలు
మనమే ఆనందపు అంచులం
మనవే శుభాకాంక్షల అష్టైశ్వర్యాలు.
కొద్దిమందైనా మనం వామనమూర్తులం...

"కరక్టుమాట చెప్పావు పాకాలు... ఈ మాటమీదే విలువ." అంటూ బ్రాందీ బాటిల్ టేబిల్‌మీద పెట్టాడు వామనరావు.

క్లబ్‌లో ఒకమూల పేకాట జోరుగా సాగుతున్నది. వాళ్ళు వంచకుండా సంపాదించిన డబ్బుతో విలాసంగా ఆడుతున్నారు. వాళ్ళు ముగ్గురైనా వేలకొలది ప్రజల జీవితాలతో చెలగాటాలాడు

ఉన్నారు వినోదిస్తున్నారు.

"అరేయ్ మాట తప్పేరకం కాదురా. ఈ పాకాలు చేస్తే నన్ను పని చేసి చూపిస్తాడు" అన్నాడు పాకాలు కొంచం రోషంగా పేకముక్కలు ఎంచుతూ.



"బుల్లిచేతులవాడి మాటలకేం గానీ.. నువ్వు చెప్పినట్లుచేస్తే నిన్ను చైర్మన్ చేస్తాను. మునిసిపల్ చైర్మన్ చేస్తాను" అన్నాడు మారీచరావు తన ప్రక్కనున్న మిసెస్ సావిత్రి సత్యానందాన్ని దగ్గరికి లాక్కుంటూ.

"ప్రామిస్" అన్నాడు పాకాలు పేకముక్కలు పంచటం ఆపి వాళ్ళిద్దరివంక చూస్తూ.

"క్రియారూపంలో చూపించు. నీకు కంపెనీలో షేరు పెంచుతాను... బుల్లిచేతులవాడు మాటతప్పేరకం కాదు—" అన్నాడు వామనరావు యింకో పెగ్గు పట్టిస్తూ.

"అరేయ్ పాకాలు... ప్రగల్భాలు ఎందుకు? మిసెస్

సావిత్రీ సల్లాపనందంపై ఒట్టు. ఈ ఆపదనుండి మమ్మల్ని గట్టెక్కిస్తే నీకు ఖాయం మునిసిపల్ చైర్మెన్ పదవి .." నొక్కినొక్కి అంటూ ఆమెని మరింత దగ్గరికి తీసుకున్నాడు సురేచరావు. వాన కొలు మొహం వికసించింది. గబగబా పేకముక్కలు పంచ సాగాడు.

* * *

క్రొత్తసంవత్సరం ప్రవేశించినా సూర్యుడు మామూలుగానే ఉదయించాడు. కుళ్ళిన కల్లుని, సారాయిని త్రాగి, త్రాగి: పచ్చిన పచ్చిమిర్చి బజ్జీలు తిని: తిని, ఆకలిని చంపి, చంపి, చలిబాధకి తట్టుకోలేని బాటసారులకు, బేవర్సులకు, పదిపైసల కిరాయితో చెప్పులషాపు వరండాలో రాత్రంతా వెచ్చదనాన్ని పంచియిచ్చిన ముత్యాలు అండ్ డాటర్స్ (బెగ్గర్స్ ప్రైవేట్ లిమిటెడ్) బద్ధకంగా వొళ్ళు విరుచుకుంది. బిలబిలమంటూ సెంటర్‌లోని స్థానిక దేశనాయకుని పాతరాతి విగ్రహందగ్గరకి చేరడానికి త్వరపడుతున్నది. మంచుతెరలు చీల్చుకుని వస్తున్న ముత్యాలు అండ్ కంపెని దేశనాయకుడి విగ్రహంప్రక్కన తాటాకు చాపమీద తెల్లని బట్టల ఆసామిని చూసి విస్తుపోయింది.

తనకన్నా ముందు ప్రపంచాన్ని ప్రకాశవంతం చేయడానికి వచ్చిన ప్రవక్తవలె తెల్లని దుస్తులతో మిలమిల మెరిసిపోతున్న పావకాల్ని చూసి ఉదయిస్తున్న సూర్యుడు అసూయతో ఎర్రగా వున్నాడు. పావకాలు వెన్నెలవలె మిలమిమిల మెరిసిపోతున్నాడు.

కానీ స్వతహా కాంతిలేని చంద్రుడాయన. చంద్రుడు ఏ శుశ్రూష చేసి సూర్యకాంతిని తనపై విరజిమ్మకొని పాలవెన్నెల వైభవాన్ని సంపాదించాడో తెలీదుగాని, అనాథగా పెరిగిన పావకాలు, వామనరావు వరండాలో కుక్కపిల్లలకి వాసనసబ్బుతో స్నానంచేయించి, మాంసంముక్కలు తినిపించి వాటిబుద్ధి తనకున్నదని నిరూపించి, మెన్‌హాల్లోకి ప్రవేశించి మాజీసంస్థానాధీశుడి వారసుడి దర్జాగా దిలా ఎడాపెడా కాఫీలు, టిఫెన్లు తింటూ నౌకర్లపై నోరులేని వాళ్ళపై అజమాయిషీ చేస్తూ స్టిక్‌మాస్టర్‌గా (కర్రపెత్తనదారుడిలా) సర్టిఫికెట్ పొంది డ్రాయింగ్‌రూంలో ప్రవేశించి బ్రాందీని గుక్కతిప్పుకోకుండా త్రాగుతూ మనుష్యుల్ని చావనీయకుండా, బ్రతకనీయకుండా తన రాజకీయ పదవి పోకుండా వుండేందుకు నక్రమరాజకీయ పద్ధతుల శిక్షణ పొందిచిఎరికి వామనరావుగారి విస్తరించిన వ్యాపారసంస్థలలో ప్రవేశపెట్టి, వారి 'బాబుకి' సాయంగా బెడ్‌రూంలో పడుకునే స్థితికి ఎగబాకి, బుచే కంపెనీలో పార్ట్నర్‌గా స్థిరపడి సంఘంలో స్థానం సంపాదించుకున్నాడు. నేడు వెలిగిపోతున్నాడు రాజకీయ నాయకుడిలా వెలిగాడు. అందర్నీ ఆకట్టుకుంటున్నాడు.

ఆ వూరిలో అదొక పెద్దసెంటరు నాలుగురోడ్ల కూడలి. సెంటరు కావడంవల్ల జనం పెరుగుతున్నారు. స్థానిక రాజకీయ నాయకుడి పాతరాతి విగ్రహంప్రక్కన కూర్చున్న పావకాల్ని

(మిగతా 49 వ పేజీలో)

(32 వ పేజీ తరువాయి)

చూసినవాళ్ళు విస్తుపోతున్నారు. ముక్కులపై వేళ్ళు వేసుకుంటున్నారు. కనుబొమ్మ లెగరేస్తున్నారు. నోళ్ళు నొక్కుకుంటున్నారు. ప్రశ్నగుర్తు అభినయంతో అంగవిన్యాసం చేస్తున్నారు. చాపమీద కూచున్న పానకాలు తనచుట్టూ మూగుతున్న జనాన్ని లక్ష్యపెట్టకుండా మౌనంగా సంస్కృతపు భగవద్గీత పటలు తిరగవేస్తూ, మధ్యమధ్య ఇంగ్లీషు బైబిల్ పేజీలు త్రిప్పుతూ, అప్పుడప్పుడు ఉరుదు ఖురాన్ తిరగవేస్తూ, కొంపలంటుకున్నట్లు కారల్ మార్క్స్ 'కాపిటల్' పుస్తకంలో కొన్నివాక్యాలు ఎర్రపెన్సిల్‌తో అండర్‌లైన్ చేస్తూ మధ్యమధ్యన తెలుగువాడిలా తలపైకెత్తి ఆలోచిస్తూ చూపరులకి శతావధానం చేసే మాంత్రికుడిలా వున్నాడు. ముగ్గుబుట్టలాంటి తల కనికట్టు విద్యచేసేవాడిలా నుదిటిపై పెద్ద బొట్టు. మడతనలగని తెల్లని దుస్తులతో శోభనపు పెండ్లికొడుకులా కూచున్నాడు. పనికిరాని బూడిదను పొట్లాలుకట్టి, పండ్లపొడి పాకెట్ వెల పావలా అంటూ ప్రజలకి అందుబాటులోలేని భాషలో వ్యాపారంచేసే వ్యాపారిలా వున్నాడు.

ఫుట్‌పాత్ వ్యాపారస్తుల్ని పలకరించుకుంటూ వస్తున్న బీట్ కానిస్టేబుల్, సెంటరులో గుంపునిచూడగానే చిరచిర లాడుతూ, లాఠీ పూపుకుంటూ గబగబా వస్తూ "తెల్లారిందీ... రోడ్డుమీద న్యూసెన్స్ చేయడానికి" అని గట్టిగా విసుక్కున్నాడు. అప్పటివరకు అవకాశంకోసం ఎదురుచూస్తున్న పానకాలు ఒక్కసారిగా విజృంభించాడు "చూస్తున్నారుగా, ఈ పోలీసుల జులుంనశించాలి మనుష్యుల్ని గాడిదల్లా, పురుగుల్లా చూసేవిధానం. పబ్లిక్‌రోడ్‌మీద నించోడానికి, కూర్చోడానికి, పడుకోడానికి, పరిగెత్తడానికి; గెంతడానికి; ఏడ్వడానికి ప్రతిపౌరుడికి హక్కువుంది. ఈ ప్రాథమిక హక్కును ఎవరూ తొలగించలేరు ఈదేశంలో ప్రతిపౌరుడికి గాలిపీల్చడానికి హక్కుంది. సప్తసముద్రాలు ఏవొక్కరిసొత్తుకాదు. ఎడారులు మనందరివి. బంజరుభూములతోసాటు బజాల్లని పంచమనండి.

అశోకుడు గొప్పరాజు రోడ్డుకిరువైపులా చెట్లు నాటించాడు. ఔరంగజేబ్ గొప్ప చక్రవర్తి. కష్టపడి పనిచేసి జీవించేవాడు. మారీచరావుగారు మన మునిసిపల్ ఛైర్మన్. రోడ్లమీది చెట్లను కొట్టించి కట్టెలవ్యాపారం పెట్టాడు. వామనరావు బుచేకంపెని అధిపతి. అలనాడు వామనమూర్తి బలిచక్రవర్తి నెత్తిపై కాలుపెట్టాడు. కాని ఈ నాడు వామనరావు వేలాది కార్మికుల నెత్తిపై కాలుమోపి నారికాయకష్టంతో కులుకుతున్నాడు. వాడి బుల్లిచేతి పిడికిట్లో మనందరి జీవితాలున్నాయి. ఈ అన్యాయం నేను చూడలేకపోయాను." పానకాలు ధోరణి అలా సాగిపోతున్నది

సినిమా ప్రకటనలు, స్థానికసంస్థల వేలం ప్రకటనలు, నిరుద్యోగుల కన్నీళ్ళుతుడవడానికి ఉద్యోగాల ఖాళీలమోజు వాణిప్రకటనలు, పబ్లిక్ ప్రవేట్ సంస్థల వార్షోత్సవాలు, రజిత, స్వర్ణోత్సవాల ప్రకటనల ప్రత్యేక అనుబంధాలు వున్నప్పుడు మాత్రమే వెలువడే స్థానిక దిన, వార, పక్ష, మాస, త్రైమాస, సంవత్సరిక పత్రికల ఎడిటర్

కమ్ పబ్లిషర్ ప్లస్ ప్రింటింగ్ప్రెస్ మేనేజర్లు అద్దెపెకిళ్ళమీద, కాలి నడకన, పరుగుపరుగున క్రొత్తగా వెలిశిన నాయకుడ్ని చూడడానికి సెంటరుకివచ్చారు.

* * * *

మున్సాలిటీకపైగా మునిసిపల్, బుచేకంపెనీ ప్రకటనలతో నింపి, మిగతా కొద్దిస్థలంలో సంచలనవార్తల్ని ప్రకటించాయి స్థానిక పత్రికలు 'పెట్టుబడిదారి వర్గంలో చీలిక'. 'బుచేకంపెనితో తెగతెంపులుచేసుకున్న పానకాలు 'బుచేకంపెని యజమాని శ్రీవామనరావు తమ కార్మికులకి అధికవేతనాలియ్యడానికి నిరాకరించారు. యిది అన్యాయమని వారికి అధికవేతనాలియ్యాలనీ, లాభాలు పంచాలనీ, కంపెనిలో షేర్లు కార్మికులకివ్వాలని ఆకంపెని పార్ట్నర్ శ్రీ పానకాలు వాదించారు. శ్రీ వామనరావు అంగీకరించలేదు. తనకంపెని షేర్లు తృణప్రాయంగా విడిచి కార్మిక వర్గంలో చేరారు శ్రీపానకాలు వర్గచైతన్యానికి కంకణం కట్టుకున్నారు.

"శ్రీవారు విన్న సెంటరులో జరిగిన పేదవారి మహాసభలో కార్మికులు, కరకులు తమ సోదరులని సగర్వంగా ప్రకటించారు. వారు తమ సుదీర్ఘ ఉపన్యాసంలో ఈవిధంగా చెప్పారు. నేను మీవాడ్ని', యిప్పటివరకు గుడ్డివాడ్ని. యిప్పుడిప్పుడే నాకళ్ళు తెరుచుకుంటున్నాయి. నావాళ్ళనందర్ని గుర్తుపట్టగలుగుతున్నాను. నాకు ఎవరులేరు అందరూ ఆప్తులే. నాకు ఆస్తిపాస్తులులేవు. మీ కండబలమే నా ఆస్తి. మీరే నాఊపిరి. మీకోసం నేనువచ్చాను. మీస్థితిగతులు సరిచేయడానికి మీ కన్నీళ్ళు తుడవడానికి వచ్చాను. నా వొంట్లో రక్తం ప్రవహిస్తున్నంతకాలం మీసేవచేస్తాను. మీకు అధిక వేతనా లిప్పిస్తాను."

"అధికవేతనాలకై బుచేకంపెనీ కార్మికులసమ్మె. కార్మిక నాయకుడు శ్రీ పానకాలు రిలేనిరాహారదీక్ష."

* * * *

కార్మికుల సమ్మె అన్యాయమంటూ కంపెనికి లాకౌట్ ప్రకటించాడు శ్రీ వామనరావు. వామనరావు అనాగరికపు చర్యని గర్హిస్తూ ఆమరణ నిరాహారదీక్షకి పూనుకున్నాడు పానకాలు. బలవంతుల పోరాటంలో బలహీనులు పాచికలుగా మిగిలిపోయారు. బుచేకంపెని కార్మికుల సమ్మె మొదటివారం ఉరేగింపులతో, నినాదాలతో, అరుపులతో హనిమూన్‌కి వెళ్ళిన క్రొత్తదంపతుల ఆనందంగా కరిగిపోయింది. రెండోవారం రిలే నిరాహారదీక్షలతో రెండోసారికూడా ఆడపిల్ల పుడితే దిగులుపడుతున్న దంపతుల బాధలా కదిలిపోయింది. మూడోసారికూడా ఆడపిల్ల పుడితే ఆపరేషన్ చేయించుకుందామా: వద్దా అని మధనపడుతున్న దంపతుల్లా మూడోవారంలో కార్మికవాడ మూగబోయింది. పొట్టకూటికోసం పలువిధాల యితరత్రా పనులు చేసుకుంటూ కార్మికులు నాల్గవవారంలో చెల్లాచెదరైనారు.

పానకాలు రోజురోజుకి మున్నలుపుతూ నిగనిగలాడుతున్నాడు. గ్లూకోజు సెలైన్లు బదులుగా పంజా నిలితింటూ కొబ్బరినీళ్ళు త్రాగుతూ యిదీ రికి నిరాహారదీక్షను, సమ్మె కార్మికుల చందాలతో కొనసాగిస్తున్నాడు. అప్పుడప్పుడు మేనేజిమెంట్‌తో చర్చలంటూ వామనరావు విశ్రాంతిభవనానికి వెళ్తున్నాడు. కంపెనీ మూతబడింది. కార్మికవాడలో పొగ రాజుకోవడం కరువయింది.

* * *

"అందుకని మైడియర్ ఫ్రెండ్స్. మనమిలా వూరుకుంటే పానకాలు రోజురోజుకి పెరిగిపోయి మనల్నిమించి పోతాడు. నేడు టౌన్ నాయకుడైన పానకాలు రేపటికి తాలుకా, ఎల్లుండికి జిల్లా, ఆతరువాత రాష్ట్ర, దేశ, ఖండ, ప్రపంచనాయకుడిలా స్థిరపడి పోతాడు. వాడ్ని ఎదగనీయకూడదు. రేపు బంద్ చేస్తానంటున్నాడు. బంద్ చేస్తే అరెస్టులు జరుగుతాయి. దోపిడీలు జరుగుతాయి. కాల్పులు జరుగుతాయి. పేపర్లనిండా పానకాలు వార్తలే. పార్లమెంట్‌లో పానకాలుగురించి చర్చలు పానకాలుపేరు ప్రపంచమంతా పాకిపోతుంది అందుకని వాడ్ని ఎదగనీయకూడదు. మన దేశ, రాష్ట్ర, జిల్లా, తాలుకా, ఫిర్కా, నాయకుల ఆదేశానుసారం పానకాలు యిక ఎదగకూడదు. సమ్మె యింక కొనసాగకూడదు—" అంటూ రొప్పుతూ ఆగాడు టౌన్‌నాయకుడు. తల వంకించాడు వామనరావు. యిబ్బందిగా సీటులో కదిలాడు మారీచరావు. టౌన్ నాయకుల సమావేశంలో చర్చలు ప్రారంభమయినాయి.

* * * *

"కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా నేటితో నిరాహారదీక్షను కార్మికనాయకుడిగా విరమిస్తున్నాను. శ్రీ వామనరావుతో సుదీర్ఘ చర్చల అనంతరం, మహానందంతో నేటిచర్య తీసుకున్నాను. శ్రీ వామనరావు లాకౌట్ తొలగించారు. మీరింక యధేచ్ఛగా కంపెనీకి వెళ్ళి పనులకి హాజరుకావచ్చును. మీకేకాలివ్వకపోయినా విధేయులైన ఉద్యోగులకి రిట్రెంచ్‌మెంట్ వుండదు. సమ్మెకాలానికి జీతమివ్వకపోయినా, పనిలో చేరినదగ్గరనుంచి సక్రమంగా జీతం యివ్వబడుతుంది. మీకు కంపెనీలో షేర్లురాకపోయినా, మీ గ్రాడ్యుయిటీకై ఒక ప్రత్యేకకమిటీ నియమించడం జరిగింది. మన సమ్మె విజయవంతమయింది. కార్మికులు తిరిగి కంపెనీని తెరిపించారు. యిది ప్రపంచ చరిత్రలో శిలాక్షరాలతో లిఖించబడుతుంది"-అంటూ సెంటరులో చేరిన కార్మికుల సమక్షంలో ఎయిర్‌కండిషన్ కారులోంచి దిగివచ్చిన వామనరావు అందించిన చల్లని బీర్‌లాంటి కొబ్బరినీళ్ళు పుచ్చుకున్నాడు పానకాలు.

* * *

పానకాలు నోటికి విస్కీబాటిల్ అందించాడు వామనరావు. పిశాచంలా పకపకనవ్వుతున్నాడు పానకాలు. బుచేకంపెని ప్రధమ భాగస్వామ్యమైన పానకాలు పిశాచంలా పకపకానవ్వుతున్నాడు. మారీచరావు అష్టవంకరలు తిరిగిపోతూ మిసెస్ సావిత్రీ సత్యానందాన్ని పానకాలు పరిష్వంగలోకి వదలాడు. అపూర్వ మునిసిపల్ చైర్మన్ పానకాలు వగబట్టిన పాములా బుసలుకొడుతున్నాడు. క్రొత్తనాయ

కుడిలా వెలిసిన పానకాలు వెకిలినవ్వులు నవ్వుతున్నాడు. వాళ్ళు ముగ్గురు వొకటే. వాళ్ళకి కావలసినది వొకటె. అది హోదా—డబ్బు- వాళ్ళు చీలిపోరు. వాళ్ళ అలవాట్లు మానుకోరు. మోసంచేయడం వాళ్ళకి వెన్నతోబెట్టిన విద్య. వాళ్ళని అర్ధంచేసుకోవడం కష్టం. దేశంలోని కరువుకాటకాంతో వాళ్ళకి పనిలేదు. వాళ్ళకి అవసర మొచ్చినప్పుడు అవతరిస్తూవుంటారు. క్రొత్తక్రొత్త అవతారాలు ఎత్తుతూవుంటారు.

* * * *

ప్రియమైన చదువరీ, మీరింతవరకు క్రొత్తగావెలిసిన నాయకుడ్ని చూశారు. వారిచేష్టల్ని గమనించారు. వారి ఎత్తుగడల్ని ఊహిస్తున్నారు. అవునా? అసలు శ్రీవారిఅవతారమెత్తడానికి కారణ మేమిటని కుతూహల పడుతున్నారు - అవునా - ఇదిగో సమాధానం. అందుకోండి.

* * *

బుచేకంపెనిలో తయారైన వస్తువులు పెరుగుతున్నాయి (Manufacturing goods) వాటికి తగినంత మార్కెట్ లేదు. (అమ్మకంలేదు) కొంతకాలం ప్రొడక్షన్ ఆగాలి (వస్తువులతయారి ఆగాలి) లేకపోతే కంపెనికి నష్టంవస్తుంది. బుచేకంపెని యజమాని వామనరావుకేంచేయాలో పాలుపోవడంలేదు. కార్మికుల్ని ఎంతరెచ్చగొట్టినా సమ్మె చేయడంలేదు. కంపెనికి నష్టాలు వస్తున్నాయి. వామనరావుకి పిచ్చిఎక్కింది. పదిపైసల వాటాదారుడైన పానకాలు ఒక పధకం తయారుచేశాడు. కార్మికనాయకుడిగా వెలిశాడు. అధికవేతనాలకై కార్మికులచే సమ్మెచేయించాడు. కంపెనిలో తయారైన సరుకు అంతా అమ్మకం జరిగేవరకు సమ్మె కొనసాగించాడు. చివరికి కార్మికుల్ని మోసగించి, క్రిందపడ్డా పైచెయ్యి తనదంటూ కార్మికనాయకుడిలా మిగిలిపోయాడు.

యిక మారీచరావుది ఆవూరి మునిసిపాల్టి. తరతరాలుగా వాళ్ళ వంశస్తులు ఏలుతున్న ఇరపైమూడు వార్డుల వూరది. యింతవరకు వాళ్ళకి ఒకవార్డుమెజార్టి వుంది. కాని ఇందరు ఒకచోట చేరినందువల్ల రెండోవార్డు అపోజిషన్‌కి పోయేపరిస్థితి ఏర్పడింది. మారీచరావు చైర్మన్‌పదవి అపోజిషన్‌కి పోతుందని మదనపడసాగాడు. అభయమిచ్చాడు పానకాలు. కార్మికనాయకుడు పానకాలు. కార్మికవాడ అభివృద్ధిచేస్తానన్నాడు, పట్టాలిప్పిస్తానన్నాడు, మరీచరావు

వామనరావు తనవైపు తిప్పుకున్నాడు, స్థానికపత్రికల్లో సంచలనం సృష్టించాడు. బలహీనవర్గప్రతినిధిగా ప్రాపగాండా చేయించుకున్నాడు. తనని నమ్మినవాళ్ళని మరింత నమ్మించాడు. నమ్మనివాళ్ళని డబ్బుతో కొన్నాడు. కౌన్సిలర్ అయ్యాడు. మారీచరావు ఆశీస్సులతో చైర్మన్ అయ్యాడు చివరికి కార్మికవాడ మునిసిపల్ స్థలమని, అక్కడప్రజల వినోదంకోసం అమ్యూజ్‌మెంట్ పార్కు పెట్టడానికి వామనరావుకి పర్మిషన్ యిచ్చాడు. కార్మికవాడ గగ్గోలుపెట్టింది. రాయబారాలు నడిపింది తిట్టింది శ్రీ పానకాలు విందుకుండలా నిర్భయంగా అన్నాడు "ఈదేశప్రజలకి ఓర్పు అవసరం, ఉన్నదానితో సర్దుకుపోవడం అవసరం. మీసమస్య యిళ్ళుకట్టుకోడానికి స్థలాలుకావాలి. అంతేగా, ఇకనైరెండు వార్డుల్లో మీరు యధేచ్ఛగా ఎక్కడైనా యిళ్ళు కట్టుకోండి నాకు అభ్యంతరంలేదు. కాని స్థలఆక్రమణపన్ను యింటిపన్ను మునిసిపాలిటీకి చెల్లించండి. మీక్షేమమేనాక్షేమం, మీరందరూ కలిసివుంటే ప్రమాదం, అగ్నివల్లప్రమాదం, మీపేర్లను ఇకనైరెండువార్డుల్ని వోటర్స్‌లిస్టులో కలుపుతాను, మీకు వోటు వుంటుంది - న్యాయం - శుభం"—

□



ఇళ్ళ అద్దెలు ఆకాశాన్ని అంటుకున్నందుకు ఒక కొత్త డాక్టరుగారు జనసమ్మర్దం ఎక్కువగానూ, అద్దెలు తక్కువగానూ వున్న ఒక పేటలో ప్రాక్టీసు ప్రారంభించాడు. ప్రతిరోజూ అద్దె బకాయి కోసం యింటి యజమాని రావడం తప్పితే ఒక్క పేషంటూ తగల్లేదు. పాపం! చూసి చూసి, డాక్టరుగారు యింటి ఓనరుతో యిలాగ సెలవిచ్చాడు. "అయ్యా, మీ అద్దె బకాయి కోసం మీరు రోజూ వస్తున్నందుకు కాదు గానీ, ఆ వచ్చేటప్పుడు తలకు కాస్త బేండేజి చుట్టుకొని రాకూడదూ, పేషంటనుకుంటారు చూసేవాళ్ళు.